“నీకు తెలీనిదేముంది. మారుతున్న కాలంతో రాజీపడలేని మనిషి ఆయన....అవునూ కాసులపేరెక్కడిదే.”

“క్రిందటిసారి వచ్చినప్పుడు చెప్పానుకదమ్మా ఆయన చేయిస్తున్నారని. ఇదిగో ఇన్నాళ్టికి సాధ్యపడింది.”

“బాగున్నావా సరళా” అంటూ ఆడపడుచుని పలకరించిన పావని ఆమెనుంచి ఏ జవాబు రాకపోయేసరికి వంటగదివేపు నడిచింది.

తనకోసం వచ్చానని చెబుతూ కనీసం తనని చూడాలని ఒక్కసారయినా గదికి రాని కూతురినీ మారుతున్న కాలంతో రాజీపడలేని మనిషినంటూ తన గురించి అభిప్రాయాని వ్యక్తం చేసిన భార్యనీ ఆయన తూలనాడటం లేదు మనసులోనైనా.

చాలా మామూలుగా ఆలోచిస్తున్నాడు.

అహోరాత్రుల కృషి దశాబ్దాల తపస్సు ఆయన్ని పండితుడిగానే మార్చాయి తప్ప ఒక మామూలు మనస్తత్వపు లోతుల్ని గుర్తించగలిగే శక్తినివ్వలేదు. అందుకు సిగ్గుపడుతున్నాడు.

“తాతయ్యా!”

పడుకునే నెమ్మదిగా తలతిప్పాడు నానీవేపు.

“ఊళ్ళో అందరికీ నువ్వంటే ప్రేమకదా.”

నానీకి బాగా తెలిసిన వాస్తవాన్నే గుర్తుచేస్తున్నాడు.

“అవునా?”

జవాబు చెప్పలేదాయన

“నాన్నమ్మకీ, నాన్నకీ, అత్తయ్యకీ మరెందుకు ప్రేమ లేదు?”

మిట్టమధ్యాహ్నపు వేళ....

ఉండుండి రేగిన పెనుగాలికి సూర్యుడు శాపగ్రస్తుడిలా మబ్బుల మాటున దాగున్నాడు.

ఘడియలోనో క్షణంలోనో వర్షించబోయే ఆకాశంలా మంచమంతా పరుచుకుని వున్న కామేశ్వరి ఆమెను ఆక్రమించబోయిన చంద్రాన్ని గట్టిగా పట్టుకుని నిలదీసింది “ఎన్నాళ్ళు మనకీ చాటుమాటు వ్యవహారం” అంటూ.

పురుషార్థాలలో కామం కూడా ఒకటని బలంగా నమ్మి భార్య వుండగానే కామేశ్వరితో సంబంధం పెట్టుకున్న చంద్రం ఆ సమయంలో ఇలాంటి ప్రసక్తిని ఇష్టపడకపోయినా అసహనంగా ఆగిపోయాడు. “ఇంకెన్నాళ్ళు కాముడూ.... పావని ఇప్పటికే సగం చచ్చింది. రేపో మాపో గుటుక్కుమంటే మనకే అడ్డం వుండదు.”

“అది పూర్తిగా చచ్చేసరికి నేను ముసలిదాన్నయిపోతాను. ఈలోగా తాడిచెట్టు నీడౌతాదా తగులుకున్నోడు మొగుడౌతాడా అంటూ లోకం నన్ను ఆటపట్టిస్తుంది...ఆగు....కదలకు....ముందు నా ప్రశ్నకి జవాబు చెప్పు....”

పెద్దమనిషి కాకముందే వాత్సాయనుడి కామసూత్రాల్ని కంఠస్థం చేసిన కామేశ్వరి శంఖినీ జాతికి చెందిన అధమజాతి స్త్రీ.... కాబట్టి తన జాతి లక్షణానికి తగ్గట్టు సమయం చూసి కుటిలత్వాన్ని ప్రదర్శించగలదు .

"అసలు నీకేం తక్కువ చేశాను" కళ్లనీళ్ళు పెట్టేసుకుంది. "తొలి పరిచయంలోనే మానం కప్పుకోని పశువులూ, పక్షుల్లా నీ ముందు నిలబడ్డాను. నీ పెళ్ళాంలాగ వేళాపాళా అనకుండా జంతుజాలంలా రుతువుతో సంబంధం లేకుండా నీకు సర్వసుఖాల్ని అందించాను.... నా యవ్వనాన్ని నీకందించి నా ఆస్తినంతటికి నిన్నే రాజును చేద్దామనుకుంటున్నాను".

"అద్సరే కాముడూ.... పావని వుండగా మనం పెళ్ళిచేసుకుందామా అంటే మనం గవర్నమెంటు ఉద్యోగస్తులం చట్టమొప్పుకోదుగా" పావని తొందరగా ప్రాణాలు వదిల్తే ఈ రెండు అరసున్నాలు కలిసి పూర్ణనుస్వారంగా మారిపోవచ్చని అతనికీ వుంది.

"ఇలాంటి మాటలు చెప్పే ఇన్నాళ్ళూ మభ్య పెట్టావు....ఇక నేనూరుకోను" కోపంగా మంచంమీద నుంచి దిగిపోయింది అతడ్ని దూరంగా నెడుతూ.

"అదికాదు కాముడూ...."

"చంద్రం! నేను కోరుకునేది సగం మొగుడు కాదు సంఘం ఒప్పుకునే మొగుడు....అదీ నీతో కానిపని. ఒకవేళ నువ్వు 'ఊ' అన్నా నీ భార్య బ్రతికుండగా అది వీలుకాదు. పైగా నీ తండ్రి చండశాసనుడు--".

"పిచ్చిదానా.... ఆయన నడుం విరిగిన పాములా మంచం పట్టేశాడు. పైగా నాకు అమ్మ సపోర్టుంది."

"ఈ తర్కం నా దగ్గర చాలాసార్లుపయోగించావు. కాని నీ మాటలు వింటూ ఇంకా మోసపోవడానికి నేను పద్మినీ జాతి ఆడదాన్ని కాదు...." కోపంగా ఒంటికి చీర చుట్టేసుకుంది.

బీరువాలో ఉన్న రతిరహస్యం మొదలుకొని అనంగరంగం పుస్తకాలకేసి దైన్యంగా చూస్తూ "ఇంకా ఎన్నెన్నో చేయాలనుకున్నాను కాని నావల్లకాదు. చూడు చంద్రం.... మీ ఆవిడతో తాడోపేడో తేల్చుకునిగాని మళ్ళీ యీ గడపతొక్కకు. నాకు పడక ఒక్కటే కాదు....కడుపన్నా ఇష్టమే.... మొగుడు లేకుండా తల్లినైపోయి నలుగురిమధ్య నవ్వులపాలు కాలేను" విసురుగా తన ఇంట్లోనుంచే బయటికి నడిచింది ఆఫీసుకెళ్ళాలన్నట్లుగా.

ఇది మామూలు చర్చకాదు. బాగా ముదిరిపోయిన హెచ్చరికగా గుర్తించిన చంద్రం ఉన్మాదిగా మారి కామేశ్వరి యింటి నుంచి బయటపడ్డాడు.

ఆ క్షణంలో చంద్రానికి గుర్తుకొచ్చింది పావని కాదు.

యిందులో సంపూర్ణంగా సహకరించి సలహా యివ్వగల తల్లి కాంతమ్మ.

సరిగ్గా ఇదే సమయంలో....

కాంతమ్మ కూతురిపై విరుచుకుపడుతోంది "అంటే నువ్వు ఇంటి నుంచి బయలుదేరి పదిరోజులైందన్నమాట" చేతిలోని అల్లుడు రాసిన ఉత్తరాన్ని మరోసారి చదివింది.

"అత్తయ్యకు నమస్కరించి వ్రాయునది.... మావయ్యాగారికి ఒంట్లో బాగోలేదని సరళ చీటికీ మాటికీ పుట్టింటికి వచ్చి వారాల తరబడి అక్కడే తిష్టవేయడంతో హోటల్ భోజనం మూలంగా నా ఆరోగ్యం చెడిపోతోంది. రేపు మీ దగ్గరకొస్తున్నాను. సరళకి యీలోగా మీరు కాస్త నచ్చచెప్పండి. లేదా ఆ బాధ్యత సోదరి పావనికి అప్పచెప్పండి....
దాంపత్యానికి సరైన నిర్వచనం తెలిసిన అరుదైన స్త్రీగా ఆమె నాకు సహకరించగలదన్న నమ్మకముంది-అసలు బయలుదేరి ఇప్పటికి పదిరోజులైందే ఇన్నాళ్ళూ సరళ అక్కడేం చేస్తున్నట్టు...."

కోడలు, నానీ అప్పటికే గుడికెళ్లడంతో సరళని ఓ మూలకి తీసుకుపోయి "జవాబు చెప్పవేం" అంటూ నిలదీసింది.

సరళ తలవంచుకునే అంది "ఇంటినుంచి బయలుదేరాక ఓ ఎనిమిది రోజులపాటు రాజారావుతో కలిసి హోటల్లో వున్నానమ్మా....."

తలపట్టుక్కూర్చుండిపోయింది కాంతమ్మ....

ఇప్పుడేం చేయాలి?

ఆమెను కలత పెడుతున్నది కూతురి భ్రష్టత్వం కాదు.
పావనిమీద ఇంత గౌరవభావంగల సుదర్శన్ పదిరోజుల క్రిందటే సరళ బయలుదేరిందన్న ప్రసక్తి తీసుకువస్తే చాటుగానైనా రహస్యాన్ని బయటపెట్టి కొంపముంచకుండా వుంటుందా అని....

నిన్నటి తరానికి చెందినదైనా కాంతమ్మ అవగాహన లేని మనిషి అందుకే పావని అవకాశం తీసుకుంటుందని భయపడింది.

అందుకే వెంటనే గుర్తు చేసుకుంది. భర్తనికాదు....కొడుకుని....

** ** ** **

ఎవరూ పట్టించుకోని నానీ పుట్టినరోజునాడు కొడుకు పేరున ఆలయంలో అర్చన చేయిస్తున్నప్పుడే పావని కుడికన్ను అదిరింది.

అదికూడా కాదు ఆమెను మరింత ఆందోళనకి గురిచేసింది.

దేవుడి హారతిపళ్ళాన్ని పూజారి తన ముందుంచినప్పుడు కళ్ళకద్దుకుంటుంటే దైవికంగా అతని చేయిజారి పళ్ళెం నేలపై పడిపోయింది.

ప్రపంచం గురించి పూర్తిగా తెలీని నానీ ఇది మామూలుగానే తీసుకున్నా పావని మాత్రం రెప్పలార్చకుండా గర్భగుడిలోకి రాముణ్ణి చూసింది.

నీళ్ళు నిండిన కళ్ళతో సీతమ్మ విగ్రహాన్ని గమనిస్తూ "నేను బంగారులేడిని కోరడంలేదమ్మా....ఉన్న ఒక్క పసికందు నూరేళ్ళు నిశ్చింతగా బ్రతికేట్టు ఆశీర్వదించమంటున్నాను-గుండెలు పగలగొట్టుకుని నిన్ను అక్కున చేర్చుకున్న భూదేవిలాంటి అమ్మ లేదు నాకు.... కాని అంత శక్తి గల అమ్మగా నా బిడ్డను రక్షించుకోవాలనుకుంటున్నాను. పోని శక్తికూడా వద్దు.... ఆ మాత్రం అదృష్టం దక్కించు చాలు" అనుకుంది మనసారా చేతులు

జోడించి.

కళ్ళు తిరిగినట్టయి గుడిద్వారన ధ్వజస్థంభం దగ్గర చతికిలబడి పోయింది.

"ఏమైందమ్మా" భయంగా అడిగాడు నానీ అమ్మ కళ్ళలోకి చూస్తూ.

"నాన్నా నానీ...." కొడుకును గుండెలకు హత్తుకుంది "నేను నేర్పిన కథలన్నీ నీకు గుర్తు వున్నాయి కదూ."

"ఓ" కళ్ళను వెడల్పు చేసుకుంటూ జవాబు చెప్పాడు.

"అపరాత్రివేళ భయమేస్తే...." స్వప్నంలోలా అడుగుతూంది.

"వెయ్యదమ్మా.... నువ్వుంటావుగా."

"నేను లేను అనుకో" ఆమె గొంతు వణికింది.

"ఎందుకనుకోవాలి?"

"మంచి నానీవి కాబట్టి" అదే అమ్మ ఉపయోగించే చివరి అస్త్రం....

"దేవుడిపాట పాడుకుంటా భయమెయ్యకుండా."

"వేళకి అన్నం పెట్టకపోతే."

"ఆకలిపాట పాడుకుంటాను."

"ఎవరూ నిన్ను దగ్గరకు తీసుకుని ముద్దాడలేదనుకో."

"అమ్మ పాట పాడుకుంటా."

"ఏడుపొస్తే..."

"నవ్వు పాట పాడుకుంటాను"

ఇక నిభాయించుకోలేనట్టు ఉద్వేగంగా నానీని దగ్గరకు తీసుకుని చెంపలనీ, నుదురునీ, తలనీ ముద్దులతో ముంచేసింది.

అమ్మ కళ్ళు తుడుస్తూ "ఇప్పుడా పాటలన్నీ ఎందుకమ్మా" అడిగాడు

"గుర్తున్నాయో లేదో అని."

"మరచిపోనుగా...." అన్నాడు.

లేచింది....గుడిప్రాంగణం దాటి బయటికొచ్చాక వెనక్కి తిరిగి మరోమారు చూసింది గర్భగుడివైపు.

ఇంటికొచ్చేసరికి ఇల్లంతా బోసిపోయినట్లయింది.

సరళగాని, అత్తయ్యగాని ఎవరూ కనిపించలేదు పావనికి.

వాళ్ళు కాదు నానీకి ముఖ్యులు.

దేవుడి ప్రసాదాన్ని అందుకుని సరాసరి తాత గదిలోకి పరుగెత్తాడు.

"ఏంట్రా నానీ భడవా...నీ పుట్టినరోజునాడు ఇంతసేపు నన్నొదిలి బయట తిరుగుతున్నావా" ప్రేమగా మందలించాడు.

"అయ్యో.... నేను బయట తిరగటంలేదు తాతయ్యా రాముడి గుడికెళ్ళాను అమ్మతో."

“దేవుడ్ని ఆశీర్వదించమన్నావా?”

“అదంతా అమ్మ చూసుకుంది.... నేనేమో రాముడికి నీ గురించే చెప్పాను.”

“ఏమి చెప్పావు?”

నానీ సిగ్గుపడుతున్నాడు.

“చెప్పరా భడవా....”

“మరేమో.... నువ్వు మంచి రాముడివి-అందుకే మీ నాన్న చెప్పినట్లు విన్నావు....” ఆగి ఆగి చెపుతున్నాడు “మా నాన్నేమో తాత చెబితే వినడు.... నాన్నని తాతని మంచి కొడుకుని చెయ్యి అన్నాడు.”

“అప్పుడు” విశ్వేశ్వరశాస్త్రి కంఠం అప్పటికే రుద్ధమైంది. “అలాగే అన్నాడా?”

“వినబడిందో లేదో.......మనసులో అనుక్కున్నాను కదా” కొద్దిగా అనుమానాన్ని ప్రకటించి. “ఎక్కడికి పోతాడు..... గుడిలోనే వుంటాడుగా రోజూ అడుగుతాను...... అలాగయితే వింటాడు. ఎంతయినా మంచి దేవుడుకదా” సర్దిఫై చేసేస్తూ “ఇదిగో ప్రసాదం తెచ్చాను” అంటూ అందించాడు.

తాతయ్య రెండో చేయికూడా లేపకపోతుంటే “పోనీలే తాతయ్య! నేను తినిపిస్తాగా” అంటూ నోట్లో వుంచాడు.